తుదిదశకు ర్యాంప్ పనులు

- మూడు ప్రధాన రహదారుల్లో తీరనున్న ట్రాఫిక్ సమస్య
- పరిశీలించిన ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు
- త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం



మల్లంపేట్ వద్ద ఔటర్‌రింగ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: మల్లంపేట ర్యాంపులు అందుబాటులోకి వస్తే ప్రజలకు ట్రాఫిక్ చిక్కులు తీరినట్లేనని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. తుది దశకు చేరుకున్న ఈ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్,జగద్గిరిగుట్ట, వివేకానందనగర్ తదితర ప్రాంతాల నుంచి వాహనదారులు గతంలో గండి మైసమ్మ మీదుగా వెళ్లి ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కేవారన్నారు. మల్లంపేటలో నిర్మాణం పూర్తి చేస్తే కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. దీంతో మూడు ప్రధాన రహదారుల వద్ద నిత్యం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్య తీరినట్లేనని తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తీరినట్లే...

ఒకవైపు బాచుపల్లి మరోవైపు మల్లంపేట్ ఇంకోవైపు గండి మైసమ్మ ఈ మూడు రహదారులకు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతూ ఉదయం సాయంత్రం వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అనుకుందే తడవుగా మంత్రి కేటీఆర్‌తో చర్చించి హెచ్ఎండీఏ అధికారులతో మల్లంపేట్ ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా మరో ర్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు వడివడిగా చేపట్టారు.

బాచుపల్లిలో ఫ్లైఓవర్...

మియాపూర్ నుంచి గండి మైసమ్మ వెళ్లే దారిలో బాచుపల్లి ప్రధాన రహదారి వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో ఎమ్మెల్సీ రాజు ఈ విషయంపై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా 1.3 కిలోమీటర్ల పొడవు, 17.50 మీటర్ల వెడల్పుతో 14 పిల్లర్ల నిర్మాణ పనుల కు శ్రీకారం చుట్టారు.

◆ అందుకు హెచ్ఎండీఏ రూ.74 కోట్లు వెచ్చించడం, ఆరు కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు చేపట్టడం, అదేవిధంగా బహదూర్ పల్లి నుంచి కొంపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర రహదారి నాలుగు లైన్ల రోడ్డు పనులు విస్తరించామని ఎమ్మెల్సీ రాజు స్పష్టం చేశారు.

◆ రానున్న రోజుల్లో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న అన్ని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దీని ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు ఎదురుకాకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

గృహలక్ష్మి పథకం.. సొంతింటి కల సాకారం

కుత్బుల్లాపూర్: గృహలక్ష్మి పథకం ద్వారా పేదల సొంతింటి కలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం గాజులరామారంలోని మహారాజ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జంట సర్కిళ్లకు చెందిన 764 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి చెక్కులు అందజేశారు. అదే విధంగా బహదురుపల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన 679 మందికి, కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన 110 మందికి, నిజాంపేట్ మున్సిపాలిటీకి చెందిన 10కి గృహలక్ష్మి చెక్కులను అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సొంత స్థలమున్న పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తామన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతుల ప్రభుత్వమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, దుండిగల్ వైస్ చైర్మన్ పద్మారావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు లక్ష్మారెడ్డి, జైరామ్, డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, శంకరయ్య, పోలె శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులకు గృహలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

క్లుప్తంగా

రాష్ట్ర హోంమంత్రిపై కాంగ్రెస్ ఫిర్యాదు

జగద్గిరిగుట్ట: డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్న హోంమంత్రి మహమూద్ అలీపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జగద్గిరిగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం అమీర్‌పేటలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి తన పర్సనల్ సెక్యూరిటీ అయిన పోలీసు కానిస్టేబుల్ రామునాయక్‌పై చేయి చేసుకున్న విషయం తెలిసిందే. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ నాయకులు జలీల్‌ఖాన్, రాధాకృష్ణ, యువరాజ్, రాము తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి



జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దేగల కృష్ణమూర్తి

చింతల్: చింతల్ డివిజన్ చంద్రానగర్‌లోని నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని శనివారం సీనియర్ నాయకుడు దేగల కృష్ణమూర్తి కోరారు. ఈ సందర్భంగా శనివారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని గల్లీల వద్ద మిగిలిపోయిన పైపులైన్ పనులతో పాటు పలు ప్రాంతాల్లో వాల్వులను ఏర్పాటు చేయాలని విన్నారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వెజిటేబుల్ డే

జీడిమెట్ల: కూరగాయలు, ఆకుకూరలు తినడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలనే ఉద్దేశంతో వెజిటేబుల్ డేని శనివారం నిర్వహించినట్లు టీవీఆర్ మోడల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ కూరగాయల వేషధారణలో వచ్చి అందరిని అలరించారు. ఉపాధ్యాయులు కూరగాయల స్టాల్ ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేశారు.



కూరగాయల వేషధారణలో చిన్నారులు

ఓటమి భయంతోనే దిగజారుడు రాజకీయాలు



హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిజాంపేట్: బీజేపీ ఓటమి భయంతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రావణుడితో పోల్చుతూ బీజేపీ పోస్టర్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ శనివారం బాచుపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాలను విమర్శించే స్థాయి బీజేపీ నాయకులకు లేదన్నారు. ఎన్ని కుతంత్రాలు చేసినా కేంద్ర, రాష్ట్రాల్లో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని స్పష్టం చేశారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాల అందజేత



కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు సుల్తానా బేగంకు రూ.లక్ష, మహేష్‌కు రూ.7లక్షలు, గండిమైసమ్మకు చెందిన పూజితకు రూ.2.5లక్షల విలువ చేసే ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్సీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కల్యాణలక్ష్మి, దళిత బంధు వంటి పథకాలు దేశంలోనే రాష్ట్రానికి ప్రత్యేక స్థానాన్ని తీసుకొచ్చాయన్నారు. అదే విధంగా పలు ప్రాంతాలకు చెందిన వారు స్థానిక సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి పత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీష్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం

గాంధీఆస్పత్రి: ప్రభుత్వ నర్సింగ్ పోస్టుల ఉన్నతీకరణపై జీవో విడుదల చేయడం పట్ల గాంధీ ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గాంధీ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత కొన్నేళ్లుగా తాము చేస్తున్న డిమాండ్‌ను ఆమోదిస్తూ తెలంగాణ ప్రభుత్వం నర్సింగ్ సిబ్బంది హోదాలను మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నరేంద్రకుమార్, ఆర్ఎంఓ జయకృష్ణ, ఎల్ఆర్ఎంఓ పద్మ, డాక్టర్ రమేష్, వెంకటరమణ, చీఫ్ నర్సింగ్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు మంగమ్మ, మేరీ రోజ్‌లిన్, తెలంగాణ గవర్నమెంట్ హాస్పిటల్స్ నర్సెస్ అసోషియేషన్ అధ్యక్షురాలు సుజాత పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ముదిరాజ్, మత్స్యకారుల సంఘం సభ్యులు

దుండిగల్: చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని చెరువులో 1.30 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మత్స్యకారులకు రాయితీపై వాహనాలు, వలలు, తెప్పలతో పాటు అనేక సామగ్రిని అందిస్తున్నామని అన్నారు. మత్స్యకారులు వినియోగించుకోవాలని సూచించారు. వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు మన్నె రాజు, బౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మురళీ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బౌరంపేట్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మన్నె బాలరాజ్, బాగయ్య, భిక్షపతి, చింత మల్లేశ్, గణేశ్, మన్నె శేఖర్, చింత వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద గుడ్డు పొదిగినప్పటి నుంచి చేప పిల్లల పంపిణీ వరకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డి అన్నారు. బౌరంపేటలోని పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో పిట్ల లక్ష్మణ్, దూలపల్లి సత్యనారాయణ, సాయికృష్ణ, గడిల మల్లేశ్, శ్రీకాంత్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బౌరంపేట సీడ్స్ ప్రీస్కూల్ ఫ్రాంచైజ్ ప్రారంభం



సీడ్స్ ప్రీస్కూల్ ఫ్రాంచైజీని ప్రారంభిస్తున్న కృష్ణచైతన్యరెడ్డి

దుండిగల్: మంచి వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన అందించాలని టెడెక్స్ స్పీకర్ కృష్ణచైతన్య రెడ్డి అన్నారు. ఫ్యూచరిస్టిక్ ఎడ్యు ఇనిషియేటీవ్ సంస్థ శనివారం బౌరంపేటలోని తమ సీడ్స్ ప్రీస్కూల్ ఫ్రాంచైజీని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఐ వైస్‌చైర్మన్ పాండురంగాచారి, ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE I ADDL SENIOR CIVIL JUDGE : GUNTUR
O.S. No. 44 / 2017
Between:
Ravula Lakshmi Kumari. ...Plaintiff
And
Katam Kanakamma (Died) & Others. ...Defendants
To,
D-6:K.Sabitha.D/o.Ranga Babu, R/o.Door No:5-744/1,HMT,Chintal,Tirumalgiri,HMT Township, Hyderabad-54
[illegible]
ది.31-10- 2023న [illegible]
[illegible]
V. USHA KIRAN REDDY
Advocate for Plaintiff, Ankireddy Palem, Guntur. Cell: 9010228664

పేద విద్యార్థుల విద్యకు కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ కృషి



నిజాంపేట్ ప్రభుత్వ పాఠశాలలో కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పిల్లల కష్టాలు తీర్చేందుకు కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్(కేకేఎం) ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, గొడుగు, గడియారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ... 2006లో స్థాపించిన తమ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయలను మెరుగుపరచడానికి కృషి చేశారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు కిట్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బుచ్చిరెడ్డి, సుమన్‌రావు, భిక్షపతి, సాయికృష్ణారెడ్డి, కొంకి రాము, నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ చైతన్య సదస్సు

నిజాంపేట్: బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీలాసుందరయ్య ఫంక్షన్‌హాల్‌లో బ్రాహ్మణ చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఏపీఎస్ మూర్తి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే సదస్సుకు మాజీ డీజీపీ అరవిందరావు, తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీదేవి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



సూరారం రాజీవ్‌గృహకల్ప 92వ బ్లాక్ వద్ద దుర్గంధం

సుభాష్‌నగర్: సూరారం రాజీవ్‌గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడ చూసినా రోడ్లపై పారుతున్న మురిగే దర్శనమిస్తోంది. ఇక 92వ బ్లాకు వద్ద పరిస్థితి మరింత దారుణంగా మారింది. దుండిగల్ మున్సిపల్‌కు సుభాష్‌నగర్ డివిజన్ సరిహద్దు కావడంతో ఈ రోడ్డు సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. రోడ్డుపై మురుగు పారుతుండడంతో అటుగా రాకపోకలు సాగించడం లేదు. దుర్వాసనతో అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పాదయాత్రకు తరలిన ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: శీతకాలం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పాస్ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆలంపూర్ నుంచి చేపట్టిన పాదయాత్రలో పాల్గొనేందుకు ఎంఎస్ఎఫ్ నాయకులు ఓయూ నుంచి తరలివెళ్లారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎంఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ బస్సుకు జెండా ఊపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టి మాదిగ, మాదిగల ఉప కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరన్న, ఉపేందర్, నర్సయ్య, శ్రీనివాస్, శివకుమార్, నాగేందర్, మండ్ల రవి, బాలు నాయక్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ కోలుకోవాలని పూజలు

ఉస్మానియా యూనివర్సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఓయూలో కాంట్రాక్టు అధ్యాపకులు పూజలు చేశారు. శనివారం క్యాంపస్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీఎం త్వరగా కోలుకుని గతంలో ఇచ్చిన కాంట్రాక్టు అధ్యాపకుల పర్మనెంట్ ఫైల్‌పై సంతకం పెట్టాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నేతలు రామేశ్వర్ రావు, రేష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేష్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ నేతలకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: బిహార్ రాష్ట్రంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 30వ జాతీయ మహాసభల్లో ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించారు. జాతీయ అధ్యక్షులు మిక్కీ మహేశ్వరి, ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్‌లను తెలంగాణ ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు ఉప్పరి ఎల్లేష్, ఓయూ నాయకులు గ్యార నరేష్, సత్య తదితరులు శాలువతో సన్మానించారు.

రేపు డీఎస్‌పీ విద్యార్థి విభాగం ఆవిర్భావ సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రంలో రేపు(9న) ధర్మ సమాజ్ ప్రోగ్రామ్ స్టూడెంట్ వింగ్ (డీఎస్‌పీఎస్‌డబ్ల్యూ) ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు డీఎస్‌పీ విద్యార్థి వింగ్ స్టేట్ అడ్వైజర్ కార్తీక్ తెలిపారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సైదాబాబు, లింగయ్య, శివ, ప్రసాద్, కార్తీక్, రాజు పాల్గొన్నారు.



కోర్టు ఆదేశాలతో కూల్చి మళ్లీ అనుమతులు ఎలా ఇచ్చారు?

- ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో అధికారులు విఫలం
- నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో విఫలమైన కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కమిషనర్ స్పందించడం లేదన్నారు. దీంతో లక్షలాది రూపాయలు పన్నుల రూపంలో ప్రభుత్వం కోల్పోవాల్సి వస్తోందన్నారు. ధర్నా జరుగుతున్న సమయంలో కమిషనర్ లోనికి రాకుండా గేటు బయట నుంచే వెళ్లిపోవడం ఆయన చేతగాని తనానికి నిదర్శనమన్నారు.

జీవో 59 కింద పార్కు స్థలాన్ని కాజేసేందుకు...

◆ నందనవనం కాలనీ ఇప్పటికే డ్రైనేజ్ సమస్యతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే దొడ్డిదారిన ఎమర్లాడ్ హైట్స్ అపార్ట్‌మెంట్స్‌కు డ్రైనేజీ లైన్ కలపడం దారుణమన్నారు. నిజాంపేట్ స్ప్రింగ్ విల్లాస్ కాలనీ లేఔట్‌లో లేని 7ప్లాట్లను, తుర్కచెరువు బఫర్, గ్రీన్ బెల్ట్‌లో విల్లాలను కోర్టు ఆదేశాలతో కూల్చి వేసిన తిరిగి మరలా ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. నిజాంపేట్ కీర్తి లేఅవుట్‌లో జీవో 59 కింద పార్కు స్థలాన్ని కాజేసేందుకు కొందరు యత్నిస్తున్నారని.. కార్పొరేషన్ పరిధిలో చెరువులు, కుంటలు కబ్జాకు గురవుతున్నా కమిషనర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చేతకాకపోతే కమిషనర్ ఇక్కడ నుండి బదిలీ అవ్వాలని డిమాండ్ చేశారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, ఎస్సీ మోర్చా జాయింట్ సెక్రటరీ దాసి నాగరాజు, పార్లమెంట్ కోకన్వీనర్ డాక్టర్ రాజు, జిల్లా ఓబీసీ మోర్చా సభ్యుడు కాశి, కార్పొరేషన్ సెక్రటరీ అజయ్ కుమార్ రెడ్డి, అరుణ్ రావు, అధికార ప్రతినిధి కౌశిక్ నాయుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు కవితా రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సాయి రెడ్డి ,ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, ట్రైబల్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు అశోక్, ఎల్ల స్వామి, నందనవనం కాలనీ సభ్యులు రంగ రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

నాకెందుకులే అని అనుకోలేదు..

కారు దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన జీడిమెట్ల సీఐ

జీడిమెట్ల: నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి జీడిమెట్ల, దూలపల్లి వెళ్లే చౌరస్తా మొత్తం శనివారం ఉదయం ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో వాహనాలన్నీ ఇరుక్కుపోయాయి. అక్కడ వాహనాలను క్రమ పద్ధతిలో పంపేందుకు ట్రాఫిక్ సిబ్బంది ఎవరూ లేరు. అప్పుడే తన వాహనంలో అటుగా వస్తున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ వాహనాలు ఇరుక్కుపోయి ట్రాఫిక్ జామ్ అవడాన్ని గమనించారు. కిందకు దిగి వాహనాలను ఒక్కొక్కటిగా క్రమ పద్ధతిలో పంపించారు. దీంతో 20నిమిషాల్లో చౌరస్తాలో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. ఇదే విషయాన్ని కొంతమంది పాత్రికేయులు సీఐ పవన్‌ను అడగగా ఏదైనా ప్రజలకు సేవా చేయడమే తమ డ్యూటీ అని బదులిచ్చారు.



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న జీడిమెట్ల సీఐ ఎం.పవన్

హాస్టల్‌లో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య



మృతుడు భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: బీటెక్ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన దుర్గారెడ్డి కుమారుడు భరతసింహారెడ్డి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ స్థానికంగా శ్రీమహేశ్వరి బాయిస్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా శనివారం భరతసింహారెడ్డి కళాశాలకు వెళ్లలేదు. ఈ క్రమంలో సాయంత్రం 4.30 గంటల సమయంలో తాను ఉంటున్న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.